క్లుప్తంగా

సామాజిక భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పెద్ద ఉప్పాడ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనాన్ని వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం ప్రారంభించారు. మత్స్యకారుల అవసరాలను గమనించి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలతో భవన నిర్మాణం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు గోస్తనీ విద్యార్థి



అవినాష్‌ను అభినందిస్తున్న టీచర్

పద్మనాభం: పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పిల్లి అవినాష్ అండర్ – 14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అనంతపురం జిల్లాలో ఈ నెల 28న జరగనున్న పోటీల్లో పాల్గొంటాడు. అవినాష్‌ను గురువారం గోస్తనీ విద్యాపీఠ్ అధినేత కాళ్ల సూరిబాబు, హెచ్‌ఎం ములపర్తి పైడిరాజు, పీఈటీ నిమ్మకాయల బంగారునాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

లీకేజీతో తాగునీరు వృథా



చిట్టివలస శివాలయం వద్ద వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: భీమిలి జోన్ కొండపేట పంప్ హౌస్ నుంచి భీమిలి పట్టణానికి తాగునీరు సరఫరా అయ్యే మార్గంలో చిట్టివలస శివాలయం వద్ద ఇటీవల తరచూ నీరు వృథాగా పోతోంది. ఇక్కడే కాకుండా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ దగ్గర రెండు పాయింట్లలో పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి నీరు వృథా అవుతోంది. వీటికి మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

11 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

భీమునిపట్నం: భీమిలి వైఎంసీఏ ఆధ్వర్యంలో నవంబర్ 11, 12న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ త్వరలో వైఎంసీఏ మెంబర్‌షిప్ డ్రైవ్ నిర్వహించనున్నామని తెలిపారు. కార్యదర్శి ఆల్బర్ట్ సుదర్శన్, కోశాధికారి కె.ప్రేమానందరావు, సభ్యులు జి.ఏసుదాస్, విలియమ్ కేరీ, ప్రభాకర్, రేవంత్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని డ్వాక్రా, దివ్యాంగుల స్టాళ్లను గురువారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ పరిశీలించారు. వారు విక్రయిస్తున్న సరకుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం బజారు 86, సాయంత్రం బజారు 45 స్టాళ్లకు డ్రా తీసి వ్యాపారులకు కేటాయించారు. ఈ సందర్భంగా యాసిన్ మట్లాడుతూ రైతులు వారికి వచ్చిన స్టాల్‌లో వ్యాపారం నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు వద్ద ఐడీ కార్డు ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి సీఎం జగన్ పెద్దపీట

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



శిబిరంలో సన్మానించిన వైద్యులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీ రాము, నాయకులు

తగరపువలస: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి జోన్ బొగ్గురోడ్డు – 1 వార్డు సచివాలయం పరిధిలోని చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డితో కలిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాతుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకుని అప్పుడే 5 కళాశాలలు నిర్మించి 42 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం మండలానికి రెండో పీహెచ్‌సీ ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రి జగన్ అయితే ఎన్నికల కోసం పనిచేసే వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఎన్నికల ముందు చాలా మంది సినీనటులు ప్రజల వద్దకు వచ్చి చేసే వాగ్దానాలు నమ్మవద్దన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, సంతోషం కోసం పనిచేసే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని మరపించేలా ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయన్నారు. లంచగొండితనం, అవినీతి, వివక్ష లేకుండా సేవలు అందిస్తున్న నిజమైన హీరో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పనిచేసే ప్రభుత్వంపై బురద చల్లుతున్న ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే అందులో భీమిలి ప్రాంత్రం కీలకమన్నారు. ఈ సందర్భంగా వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ బి.రాము, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, కార్పొరేటర్ డి.ఏడుకొండలు, సరగడ రఘునాథరెడ్డి, శిల్లా కరుణాకరరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, అక్కరమాని మంగరాజు, కొప్పల రమేష్, అక్కరమాని చినబాబు, సిమ్మల ప్రసన్న, గంట్రేటి ఈశ్వరరావు, పందిరి విజయ్, గిడుతూరి మురళి, పూర్ణ, తెడ్లాపు అప్పలరాజు, నీలాపు రామిరెడ్డి, లెంక రమేష్, ఎర్పెర్ల హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో అన్ని రకాల సేవలు

మధురవాడ: ప్రజలకు అన్ని రకాల సేవలు మరింత చేరువ చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. జీవీఎంసీ 7 వార్డు గణేష్‌నగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాలు సేవలు ఇంటి వద్దనే అందించడంతోపాటు వివక్ష, అవినీతి లేని పాలన కావాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పేదలకు మందులు, కళ్లద్దాలు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పోషకార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్ రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, నాయకులు పిళ్లా సూరిబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, రైల్వే బోర్డు సభ్యుడు ఎస్.బాబ్జి, బెల్లాపు పాపారావు, బంగారు ప్రకాశ్, సూర్యనారాయణ, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, శ్రీదేవి, భాను, జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, వైద్యురాలు సుధారెడ్డి, మధులత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న 'సురక్ష' శిబిరం నేడు

తగరపువలస: భీమిలి జోన్ చిట్టివలస వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నామని జెడ్పీ బి.రాము తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి 5 వరకు చిట్టివలస బంతాట మైదానంలో జరుగుతుందని, ఈ అవకాశాన్ని సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



శిబిరంలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయండి



కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర భీమిలి నియోజకవర్గంలో ఈ నెల 28న జరగనున్నందున ప్రజలంతా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. యాత్ర జరగనున్న చిట్టివలస బంతాట మైదానంలో గురువారం ఆయన ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి యాత్ర పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంతాట మైదానంలోకి వాహనాల రాకపోకలకు సంబంధించి మార్గాన్ని పరిశీలించి కార్యకర్తలు, నాయకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎలమంచిలి సూర్యనారాయణ, చిల్ల భాస్కరరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, జీరు వెంకటరెడ్డి, అక్కరమాని మంగరాజు, కొప్పల రమేష్, తమ్మిన నరసింగరావు, జీరు శ్రీనివాసరెడ్డి, దుంప సాయిరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, రొక్కం శ్రీను, సరగడ నాగిరెడ్డి పాల్గొన్నారు.

28 నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర

పీఎం పాలెం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రలో స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేరుగా ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను తిప్పికొడతామన్నారు. సంక్షేమ పాలనకు రాష్ట్ర ప్రజలు ప్రకటిస్తున్న మద్దతుచూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. 28న నియోజకవర్గంలోకి బస్సు యాత్ర వస్తుందన్నారు. కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి మహేష్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, 6, 7 వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గాదె రోశిరెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంకాయల మారుతీ ప్రసాద్, జేఎస్ రెడ్డి, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యురాలు రాజేశ్వరి, నాయకులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, సూరిబాబు, వాండ్రాసి రవి, కుడితి రామారావు, చేకూరి రజని, పోతిన సూరిబాబు, వెంకటేశ్వర్లు, నరసింహారావు పాల్గొన్నారు.



చిట్టివలస బంతాట మైదానంలో సామాజిక సాధికార బస్సు యాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 987వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్ర ప్రభుత్వ పెద్దలు దేశంలోని ప్రజా సమస్యలను వదిలిపెట్టి రాజకీయ అవసరాల కోసమే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీల కుట్ర రాజకీయాలను వ్యతిరేకించాల్సిన ప్రతిపక్ష పార్టీలు వారికి వంతపాడుతున్నాయన్నారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఖాదీ ధరించడం భారతీయ సంస్కృతి



ఖాదీ పేరును ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం: ఖదీ వస్త్రాలను ధరించడం భారతీయ సంస్కృతి అని, దాన్ని అందరూ కాపాడుకోవాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. ఖాదీ మహోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి మన ఆచార, వ్యవహారాల్లో ఖాదీ వస్త్రాలను అందరూ ధరించేవారన్నారు. ప్రస్తుత సమాజంలో యువతతోపాటు, పెద్దలు కూడా వీటికి దూరమవుతుండడం దురదృష్టకరమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీ విదేశీ వస్త్రాలను విడనాడి ఖాదీ వస్త్రాలను వాడాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధ్యాపకులు సోమయాజులు, త్రినాథరావు, రవి పాల్గొన్నారు.

574 మంది అడ్మిన్లకు ఈ - పాస్ మిషన్లు

- వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో నేడు శిక్షణ
- జీవీఎంసీ డీసీఆర్ సత్యనారాయణ



మధురవాడలో ఈ పాస్ మిషన్లు అందజేస్తున్న డీసీఆర్ సత్యనారాయణ

మధురవాడ: జీవీఎంసీలో 574 మంది వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు ఈ – పాస్ మిషన్లు అందజేశామని జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సీహెచ్ సత్యనారాయణ చెప్పారు. జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు గురువారం ఈ – పాస్ మిషన్లు ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మిషన్లు ఉపయోగించే విధానం, రెవెన్యూ కలెక్షన్, అడ్మిన్ల బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు. మిషన్ల వినియోగంపై మరింత శిక్షణ అవసరమని గుర్తించామని, అందుకే శుక్రవారం నగరంలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో సాయంత్రం 4 గంటలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. అంతా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో జోన్ – 2 ఆర్‌ఐలు ముగడ.రాజు, రమేష్ పాల్గొన్నారు.

రిప్లై ఆధారంగా రమేష్‌పై చర్యలు

జీవీఎంసీ జోన్ – 2లో సెలవులో ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారిక లాగిన్ ఉపయోగించి రెవెన్యూ ఫైల్స్ అప్‌లోడ్ చేసిన ఆర్‌వో రమేష్‌పై త్వరలో చర్యలు తీసుకుంటామని డీసీఆర్ సత్యనారాయణ తెలిపారు. సాక్షిలో ప్రచురితమైన కథనం ఆధారంగా రమేష్‌కు అధికారులు కొద్ది రోజుల క్రితం మెమో జారీ చేశారని, దీనికి అతని నుంచి రిప్లై వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్‌వో ఇలా చేయడానికి కారకులు ఎవరన్న కోణంలోనూ విచారిస్తున్నట్లు డీసీఆర్ చెప్పారు.

హైవే దాటాలంటే నరకయాతనే..



వుడా కాలనీ వద్ద పోలీసులు ఏర్పాటు చేయిస్తున్న హెచ్చరిక బోర్డు



కార్‌షెడ్ కూడలి సమీపంలో రోడ్డు దాటడానికి హైవేపై నడుస్తున్న మహిళలు, వృద్ధులు

మధురవాడ, కార్‌షెడ్ కూడళ్లలో అవస్థలు

మధురవాడ: జాతీయ రహదారిపై రోడ్డు దాటడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయని కార్‌షెడ్ – చంద్రపాలెం, మధురవాడ – కొమ్మాది మధ్య సెంటర్ డివైడర్‌పై రోడ్డు దాటడానికి వీలు లేకుండా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ హైవేలోనే సెంటర్ డివైడర్‌ను అనుకుని 150 మీటర్ల మేర నడిచి రోడ్డు దాటుతున్నారు. దీంతో ఇలా రోడ్డు దాటడం ప్రమాదకరం అంటూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొమ్మాది – మధురవాడ మధ్య సుమారు కిలో మీటరు మేర రోడ్డు దాటే అవకాశమే లేదు. అయినా రోడ్డు దాటడానికి ఎక్కువ దూరం నడాల్సి రావడంతో ప్రయాణికులు ప్రమాదాన్ని కూడా లెక్కచేయడం లేదు. మరికొందరు గ్రిల్స్ మధ్యలో దూరడం, గ్రిల్స్ ఎక్కి దూకడం వంటివి చేస్తున్నారు. ఇలా వదిలేస్తే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. జీవీఎంసీ, పోలీసు, హైవే అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించి, రోడ్డు దాటే ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు 29న పోటీలు

తగరపువలస: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 39వ వర్ధంతి, ఉప ప్రధాన మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ 148వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 29న విద్యార్థులకు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలిలో వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలను జాతీయ సమైఖ్యత అనే అంశంపై, వ్యాసరచన పోటీలు ఇందిరాగాంధీ, వల్లబాయ్ పటేల్ జీవిత చరిత్రపై హిందీ, తెలుగు భాషల్లో అనుమతిస్తున్నారు. 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

మారుమూల గ్రామాల్లో సెల్ టవర్ల ఏర్పాటు

త్వరలోనే ప్రజలకు ఇంటర్నెట్ సేవలు



దబ్బందలో నిర్మాణం పూర్తయిన సెల్ టవర్

ఆనందపురం : మండలంలోని మారుమూల గ్రామాల్లో సెల్‌టవర్లను బీఎస్ఎన్ఎల్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు తొందరలోనే ఇంటర్నెట్ సేవలు అందనున్నాయి. మండలంలోని కుసులువాడ పంచాయతీ, ఇచ్ఛాపురం గిరిజన గ్రామం కొండల నడుమ ఉంది. ఆ గ్రామానికి సెల్ సిగ్నల్స్ అందడం లేదు. దీంతో పింఛన్ల పంపిణీ, రేషన్ సరకుల పంపిణీ, ప్రభుత్వ పథకాల అమలుకు వేలి ముద్రల స్వీకరణకు తీవ్ర ఆటంకంగా మారింది. దీంతో గ్రామ శివారుకు వెళ్లి గ్రామస్తులు సేవలు పొందాల్సి వస్తోంది. అలాగే మండలంలోని మామిడిలోవ పంచాయతీ, దబ్బంద, రామవరం గ్రామాలదీ ఇదే పరిస్థితి. అక్కడి ప్రజలు కనీసం సెల్‌ఫోన్‌లో మాట్లాడుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి. ఈ విషయాన్ని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి బీఎస్ఎన్ఎల్ సంస్థ అధికారులతో మాట్లాడి సెల్ టవర్లు మంజూరు చేయించారు. దబ్బందలో సెల్‌టవర్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇచ్ఛాపురం, రామవరం గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్నాయి. నెల రోజుల్లో సెల్ టవర్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



ఇచ్ఛాపురంలో ప్రారంభమైన సెల్ టవర్ పనులు

సమష్టి సహకారంతో కోక్ ఓవెన్ అభివృద్ధి



నూతన విభాగాధిపతి దుర్గా ప్రసాద్‌కు బొకే అందజేస్తున్న మాజీ ఈడీ ఏకే సింగ్

ఉక్కునగరం: కోక్ ఓవెన్స్ అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేస్తే మరింత అధిక ఉత్పత్తి సాధించవచ్చని స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఈడీ ఏ.కె.సింగ్ అన్నారు. నూతన విభాగాధిపతి ఎం.వి.ఎస్.దుర్గా ప్రసాద్‌ను గురువారం ఆయన అభినందించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యాజమాన్యం అప్పగించిన బాధ్యతలను అధికారులు, ఉద్యోగుల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో, 83090 03957లో సంప్రదించాలని కోరారు.

29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జిల్లా యోగా అసోసియేషన్, ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు–2023 జరగనున్నాయి. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం ఏయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.రాజు, కార్యదర్శి సిహెచ్.వెంకటరమేష్, కోశాధికారి జి.రమణమూర్తి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై పశు మాంస వ్యర్థాలు



వేంకటేశ్వరమెట్ట వద్ద గోస్తనీనది వంతెనను ఆనుకుని ఫుట్‌పాత్‌పై పశుమాంస వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు వేంకటేశ్వరమెట్ట వద్ద గోస్తనీ నదిపై వంతెనను ఆనుకుని ఫుట్‌పాత్‌లు పశు మాంస వ్యర్థాలతో నిండి జుగుప్సాకరంగా దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని రాకపోకలు సాగిస్తున్న వారు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. పశు మాంస ఖండాలు, రక్తం, చర్మాలను రహదారికి చేరువగా ఉన్న ఫుట్‌పాత్‌లపై విచ్చలవిడిగా పడేస్తుండడంతో వీటి నుంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది నదిలో తాగునీటి వనరులు కలుషితం అవుతున్నాయి. వీటికి సమీపంలో భీమిలి జోన్ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే ఊటబావులు ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి వనరులు కలుషితం కాకూడదంటే ఇక్కడ పశు మాంస వ్యర్థాలు వేయకుండా జీవీఎంసీ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పూజలలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తీసుకొచ్చి కల్యాణం జరిపించారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా నిర్వహించారు.